ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
గురువారం | సెప్టెంబరు 03, 2026 | సంపుటి : 7 | సంచిక : 81 | పేజీలు : 2



## జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు

- అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కారు
- హామీలు అడిగితే ముఖం చాటేస్తున్నారు
- 420 హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ వైఫల్యం
- 100 రోజులన్నారు....1000 రోజులు అయ్యింది
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్
- తొలి రోజు ఇంటింటికి బాకీ కార్డుల పంపిణీ
- 420 హామీల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన

జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కార్ అని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల దగా పాలన నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా తొలి రోజు బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆకేరు వాగు, ప్రభుత్వ ఆసుపత్రి, అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ఫ్లెక్సీ ప్రదర్శన, మరియు నిరసన ర్యాలీలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొని ప్రజలకు బాకీ కార్డులను పంపిణీ చేశారు.

:... వివరాలు 2లో..

# నేను చెప్పాల్సింది చెప్పా..
## అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా

> "నేను చెప్పాల్సినవన్నీ పార్టీ పెద్దలకు చెప్పాను. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. నా వివరణ అంతా కేసీ వేణుగోపాల్‌కు వాట్సప్ చేశాను. పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందనేది నాకు తెలియదు. నా కుమార్తె వ్యాఖ్యల గురించి ఏమీ మాట్లాడను. సుస్మిత వ్యాఖ్యలను ఖండించటం, సమర్థించటం చేయను. ఇండిపెండెంట్ మహిళ మాట్లాడవద్దని చెప్పే హక్కు నాకు లేదు. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయటం సరికాదు"
> - కొండా సురేఖ, మంత్రి

- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- బీసీనైనా నాకో న్యాయం.. ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయమా..
- ఇతర మంత్రులపై ఆరోపణలకు సమాధానం కావాలి
- అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేను కోరా
- ఢిల్లీలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు



(ఢిల్లీ, ఆయుధం)

కాంగ్రెస్ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని వేచి చూస్తున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఢిల్లీలో ఉన్న ఆమె ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలిసినట్లు వివరించారు. అంతకుముందు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తనను రాజీనామా చేయమని ఇప్పటివరకు చెప్పలేదని తెలిపారు. బీసీనైన తనకో న్యాయం, ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయమా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఇతర సామాజికవర్గాలపై ఆరోపణలు ఉన్నాయన్నారు. మరి వాటన్నింటికి ఏం సమాధానం చెబుతారు? ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేను కోరినట్లు తెలిపారు. జరుగుతున్న అన్ని వ్యవహారాలపైన ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ సహా అధిష్ఠాన ముఖ్యులందరికీ అన్ని విషయాలు రాతపూర్వకంగానూ తెలియజేశానన్నారు.

**కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు :**

కేసీ వేణుగోపాల్‌ను కలవాల్సి ఉండగా, ఆయన అపాయింట్‌మెంట్ దొరకలేదు. ఖర్గేతో సమావేశమయ్యానని, కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ (మిగతా 2 లో..)



## 1000 రోజుల పాలన..
# హామీల అమలు ఏదీ?

- చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే.
- కాంగ్రెస్ వైఫల్యాలపై పరకాలలో బీఆర్ఎస్ నిరసన

**పరకాల, ఆయుధం:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాలలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు 420 అడుగుల ఫ్లెక్సీ తో బీఆర్ఎస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించి బస్టాండ్ కూడలి వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రెండు లక్షల ఉద్యోగాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని దేవుళ్లపైనా ఓట్లువేసి, బాండ్ పేపర్లపై సంతకాలు చేసి హామీ ఇచ్చినప్పటికీ.. 1000 రోజులు గడిచినా ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలకు ఇచ్చిన హామీల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గుర్తుచేశారు. ఇక కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని,కర్రుకాల్చి వాతలు పెట్టడానికి ప్రజలున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత
- డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**వరంగల్, ఆయుధం:** వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం అని డీసీసీ అధ్యక్షుడు అయూబ్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లో ఆయన చిత్రపటానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రజా నాయకుడని అన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన అందించిన పాలన ప్రజలకు భరోసాను కల్పించడంతో పాటు సంక్షేమానికి కొత్త దిశను చూపించిందని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. పేదల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన వైఎస్సార్.. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపిన గొప్ప ప్రజానాయకుడని అన్నారు. వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమ విధానాలు కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన సంక్షేమ బాటలో ప్రజా పాలన కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అయూబ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కమాలుద్దీన్, మహమూద్ పాషా, కోదాటి అనిల్, కూచన రవీందర్, గిన్నారపు రాజు, SD కుతుజ్, జన్ను ఆదాం, అమృత రావు, బండ్ల సురేందర్, యూత్ నాయకులు నిశాంత్, వినోద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?
- తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసనకు దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రశ్నిస్తూ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అండర్ బ్రిడ్జ్, మండిబజార్ ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపిస్తూ.. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అండర్ బ్రిడ్జ్, మండిబజార్ ప్రాంతాల్లో బాకీ కార్డులను ప్రజలకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బాకీ కార్డు పంపిణీ చేసే క్రమంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్యనాయకులు, నాయకులూ, మహిళా నాయకులు పాల్గొన్నారు.



2 లో

## ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే నాగరాజు, డీసీసీ ప్రెసిడెంట్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి



2 లో

## అధికారం పోయిందన్న అక్కసుతోనే బీఆర్ఎస్ విమర్శలు

- రెండుమూడేళ్లు కూడా ఓపిక పట్టలేకపోతున్నారు.. ప్రజా తీర్పును గౌరవించాలి
- నిర్మాణాత్మక విమర్శలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే
- అసెంబ్లీకి రాకుండా కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదు
- కాంగ్రెస్ పాలనను చూసి బీఆర్ఎస్‌కు వెన్నులో వణుకు పుడుతోంది
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ధ్వజం

# వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- ఉత్సవాల ఏర్పాట్లు, నిమజ్జనంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**హనుమకొండ, ఆయుధం:** గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో పోలీస్ కమిషనర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య, మైనింగ్, మత్స్య, అగ్నిమాపక, తదితర శాఖల అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ... గణపతి నవరాత్రులను భక్తులు, నిర్వాహకులు పోలీసు, అధికార యంత్రాంగం సూచనలను పాటిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించాలని కోరారు. పర్యావరణహితంగా గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహించుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. గణపతి మండపాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు మంటపాల నిర్వాహకులు పాటించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. ప్రమాద నివారణ మార్గాలను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. గణపతి మంటపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని కోరారు. పోలీస్ అధికారులు ప్రతీ మండపాన్ని తనిఖీ చేస్తారని అన్నారు.

మండపాల వద్ద సౌండ్ పొల్యూషన్ కాకుండా



జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత ఎలాంటి సౌండ్ ఉండడొద్దన్నారు. చదువుకునే పిల్లలకూ, అనారోగ్యంతో భాదపడే వారికి సౌండ్ విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. తప్పని పరిస్థితిలో ఏదైనా సాంస్కృతిక కార్యక్రమం ఉంటే లోకల్ ఏసీపీ పర్మిషన్ తీసుకోవాలన్నారు. పెద్ద మండపల వద్ద భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నప్పుడు క్యూ లైన్లు పెట్టి బారికేడింగ్ చేయాలన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వాహకులు టైమింగ్స్ ని తప్పకుండ పాటించాలన్నారు నవరాత్రులకు ఉపయోగించే వాహనాల సేఫ్టీని ముందుగా చెక్ చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా మండపాల వద్ద భద్రతకోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఎల్ నీనో పరిస్థితుల నేపథ్యంలో....నీటి నిల్వలను దృష్టిలో పెట్టుకొని పెద్ద విగ్రహాలు కాకుండా చిన్న విగ్రహాలు అందులోనూ మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని కోరారు. భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రులను నిర్వహించుకోవాలని సూచించారు. అదేవిధంగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు అన్ని ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నవరాత్రుల లో ఎమైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712685048 కి సమాచారం అందించాలన్నారు

**మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటును ప్రోత్సహించాలి: కలెక్టర్**

వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణహితంగా, ప్రశాంత వాతావరణంలో అన్ని వర్గాల సమన్వయంతో నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఉత్సవ కమిటీలకు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత వరకు మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసేలా ప్రజలను, ఉత్సవ కమిటీలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి సంవత్సరం కాలుష్య నియంత్రణ శాఖతో పాటు వివిధ సంస్థలు మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందిస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది నీటి లభ్యత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గణేష్ విగ్రహాల పరిమాణాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న, ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, జనగాం అదనపు కలెక్టర్ బెన్ షా లోం, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు ,వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లా లకి సంబంధించిన ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

- నివాళులర్పించిన డీసీసీ అధ్యక్షుడు వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

**హనుమకొండ, ఆయుధం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని హన్మకొండలోని డీసీసీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నివాళి కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, భత్తిని శ్రీనివాస్ రావు, వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక, ఐవైసీ జాతీయ కార్యదర్శి గొట్టిముక్కుల సాగరిక, డీసీసీ మీడియా కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన ప్రజాసేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్లు, పీసీసీ, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ కమిటీల ప్రస్తుత, మాజీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.



## 27వ డివిజన్‌లో వైఎస్సార్ వర్ధంతి

**వరంగల్, ఆయుధం:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని కొండ పటేల్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. 27వ డివిజన్ లోని కొండ పటేల్ కాలనీ లో డాక్టర్ వైయస్ చిత్రపటానికి వరంగల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాల కోసం ఇందిరమ్మ పథకం రాజీవ్ ఆరోగ్యశ్రీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు కోరారు. ఈ కార్యక్రమంలో కొండ పటేల్ కాలనీ అధ్యక్షులు దౌడు నాగరాజ్, శ్యామల, మార్క్ ఓడపల్లి రవి, ఎల్లగొండ శ్రీనివాస్, రామగిరి శ్రీవిద్య, విజయలక్ష్మిరేణుక, రబ్బానినసీమా బేగం, కనకరాజు, హుస్సేన్, నాజియా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, సర్దార్ జస్వీర్ సింగ్, గూఢ నవీన్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.




# అధికారం పోయిందన్న అక్కసుతోనే బీఆర్ఎస్ విమర్శలు

- రెండుమూడేళ్లు కూడా ఓపిక పట్టలేకపోతున్నారు.. ప్రజా తీర్పును గౌరవించాలి
- నిర్మాణాత్మక విమర్శలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే
- అసెంబ్లీకి రాకుండా కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదు
- కాంగ్రెస్ పాలనను చూసి బీఆర్ఎస్‌కు వెన్నులో వణుకు
- ఎంపీ డా. కడియం కావ్య

**హనుమకొండ, ఆయుధం:** అధికారం కోల్పోయామన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య మండిపడ్డారు. హనుమకొండ డిసిసి కార్యాలయంలోని మీడియా సమావేశంలో శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. మీడియా సమావేశంలో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ... అధికారం కోల్పోయామన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కనీసం రెండుమూడేళ్లు కూడా ఓపికగా ఉండలేకపోతోందని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై విమర్శలు చేయడం వారి అధికార దాహాన్ని బయటపెడుతోంది అని అన్నారు. "పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు గుర్తుకు రాలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయిన రెండుమూడేళ్లకే ఓపిక నశిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులకు ప్రజలు తీర్పు ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారు. ఇది ప్రజలపై ప్రేమ కాదు.. అధికారం కోల్పోయామన్న అక్కసు, తిరిగి అధికారం కోసం పడుతున్న ఆరాటం" అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రెండున్నరేళ్లలోనే తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చిందని ఎంపీ తెలిపారు. విద్యార్థి ఏడాది చదువుకున్న తర్వాత తన ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను చూసుకున్నట్లే.. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు తాము చేసిన పనులే ప్రోగ్రెస్ రిపోర్ట్ అన్నారు.

"మేము నోటి మాటగా చెప్పడం లేదు. ఏం చేశామో.. ఎంత చేశామో గణాంకాలతో సహా ప్రజల ముందుంచాం. బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనకు తేడాను ప్రజలే గమనిస్తున్నారు" అని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల భారంలోకి నెట్టి వెళ్లినా.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని ఆపకుండా, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. "అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివి. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపడుతున్నాం" అని స్పష్టం చేశారు. "బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అనేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసి చూపించింది. ప్రతి వర్గానికి, ప్రతి రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. చెప్పినవి చేస్తున్నాం.. చెప్పనివి కూడా చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు ఇదే మా ప్రోగ్రెస్ రిపోర్ట్. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు" అని ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని హన్మకొండలోని డీసీసీ కార్యాలయంలో వరంగల్ ఎంపి డా.కడియం కావ్య ఘనంగా నివాళులర్పించారు.

# నేను చెప్పాల్సింది చెప్పా..

(మొదటి పేజీ తరువాయి..)

దొరకలేదని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని అధిష్ఠానానికి చెప్పినట్లు వివరించారు. సుస్మితకు వివాహం అయిందని, ఆమె ఇండిపెండెంట్‌గా ఉందన్నారు. కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయొద్దని కోరానన్నారు. పార్టీలో చర్చించి ఏం నిర్ణయం తీసుకుంటారో తనకు తెలియదన్నారు.

**మంత్రి పదవిలో కొనసాగించాలని కోరా :**

తన భర్త, తాను బీసీలమని కొండా సురేఖ వివరించారు. తెలంగాణలో బీసీలు 60 శాతం ఉంటారన్నారు. కర్ణాటకలో ఇప్పటికే మహిళా మంత్రి లేరని విమర్శలు వస్తున్నాయన్నారు. మహిళలు స్వతంత్రంగా ఉండాలని రాహుల్‌గాంధీ చెబుతుంటారని గుర్తు చేశారు. సుస్మిత ఇప్పుడు మరో ఇంటి కోడలు, ఆమె ఏం మాట్లాడాలో తాను చెప్పనన్నారు. మంత్రిగా తన పనితీరు బాగుందని, తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని కొండా సురేఖ తెలిపారు. తనను పదవిలో కొనసాగించాలని, ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దని కోరానన్నారు. తన గురించి పార్టీలో కొంతమందితో బలవంతంగా మాట్లాడించారని ఆరోపించారు. వారి వెనక ఎవరో ఉండి మాట్లాడించారన్నారు. మహిళా మంత్రి గురించి మాట్లాడిన వారికి కూడా షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సురేఖ డిమాండ్ చేశారు.

**అధిష్ఠానానికి టీపీసీసీ నివేదిక:**

ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను కాంగ్రెస్ హైకమాండ్‌కు టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి దిల్లీకి వెళ్లారు. కొండా సురేఖ విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

**పదవుల నుంచి తొలగించాలని సిఫార్సు**

మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తొలగించాలని ఏఐసీసీకి పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయి రిపోర్ట్‌ను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు అందించింది. పార్టీ గీతను దాటి వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నట్లు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కొద్దిరోజుల క్రితం వివరించారు. ఈ నివేదికపైనే ఏఐసీసీ పెద్దలు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, ఇతర కీలక నేతలతో చర్చించింది.

# జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు

- అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కారు...
- హామీలు అమలు చేయమంటే మొహం చాటేస్తున్నారు...
- 420 హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ దారుణ వైఫల్యం...
- 100 రోజులన్నారు....1000 రోజులు అయ్యింది...
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్
- ఇంటింటికి బాకీ కార్డుల పంపిణీ
- 420 హామీల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన...





**వర్ధన్నపేట, ఆయుధం;** జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కార్ అని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల దగా పాలన నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా తొలి రోజు బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆకేరు వాగు, ప్రభుత్వ ఆసుపత్రి, అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ఫ్లెక్సీ ప్రదర్శన, మరియు నిరసన ర్యాలీలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొని ప్రజలకు బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు, ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను ప్రజలకు ఇచ్చిన మాటగా భావించి వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆరోపించారు, బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో కూడా ప్రజా సమస్యపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలకు గతంలో అందిన సంక్షేమ పథకాలు ఇప్పుడు సక్రమంగా అందడం లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

**ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పోరాటం..**

వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్‌లో బీఆర్ఎస్ పోరు బాట కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును వివరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆగదని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అరూరి రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ SIR, సభ్యత్వ నమోదు ఇంచార్జి మసూద్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూముల రీసర్వే త్వరగా పూర్తి చేయాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూముల రీసర్వేను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో 3541 ఎకరాల భూమి ఉండగా ఇప్పటివరకు 2144 ఎకరాల భూమి రీసర్వే పూర్తి అయినట్లు సర్వేయర్లు కలెక్టర్ కు వివరించారు. పట్టాదారు పాస్ బుక్ లో నమోదైన భూమి విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో రైతు అనుభవిస్తున్న భూమి విస్తీర్ణానికి ఏమైనా తేడాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రైతులు రాజిరెడ్డి, రామరాజు, సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి, మాధవి, సరోజన, నిర్మల, తదితర రైతులు భూముల రీ సర్వే జరుగుతున్న పంట పొలాల వద్ద ఉండగా కలెక్టర్ వారితో మాట్లాడారు. రీ సర్వే జరుగుతున్న తీరును గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వే చేస్తుండడం బాగుందని, రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని చేపట్టిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే ను మరో 15 రోజుల్లో పూర్తిచేయాలని సర్వేయర్లను ఆదేశించారు. రైతుల భూములను రీ సర్వే చేసిన వివరాలను ల్యాండ్ పార్సల్ మ్యాప్ (ఎల్పీఎం) లో నమోదు ప్రక్రియ కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. రీ సర్వే తో భూముల హద్దులు, విస్తీర్ణం, పట్టాదారు వివరాల్లో స్పష్టత రావడంతో భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీరాం భూపాల్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా భూములు కొలతలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, తహసిల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



**మడికొండ, ఆయుధం:** బాలవికాస స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో వరంగల్ జిల్లా పరిధిలోని తరాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంప్యూటర్ ల్యాబ్‌కు ల్యాప్‌టాప్‌లను మంజూరు చేశారు. 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి ప్రత్యేక చొరవతో ల్యాప్‌టాప్‌లను ఇప్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) కే.ఆర్. నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు రిబ్బన్ కట్ చేసి కంప్యూటర్ ల్యాబ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి డిజిటల్ విద్యను అందించేందుకు బాలవికాస సంస్థ, స్థానిక నాయకులు చేసిన కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరి రెడ్డి, 45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, బాలవికాస ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రతపై అవగాహన

- పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ ఎన్.శ్వేత ఐపీఎస్




**వరంగల్, ఆయుధం:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్‌ను బుధవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ ఆవిష్కరించారు.

'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్‌లో అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీ సూచించారు.

తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఈమెయిల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బహుమతులు, లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకుని టూఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం స్టేషన్ ఏసీపీ వెంకటరమణ, సీఎసి బి 2 ఏసీపీ జానీ నర్సింహులు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్. ఐలు చరణ్, శివ పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు

- ఈనెల 5 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ సీతారాం

**ములుగు, ఆయుధం:** ములుగు కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి బాలవాటిక-1, బాలవాటిక-2, బాలవాటిక-3తో పాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాల కోసం సెప్టెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ప్రారంభించిన కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల నమోదు కొనసాగుతోందని పేర్కొన్నారు. అర్హత కలిగిన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాల కోసం సెప్టెంబర్ 10న లాటరీ నిర్వహించి, 12న ప్రవేశ జాబితాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 21 వరకు సీట్ల కేటాయింపు, ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసి, 23వ తేదీ నుంచి తరగతులను ప్రారంభించనున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయ సంగఠన్ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, వయస్సు, ప్రాధాన్యతా క్రమం, రిజర్వేషన్లు తదితర నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు నిర్ణీత గడువులోగా తమ పిల్లల ప్రవేశాల కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జవహర్‌నగర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ములుగు కేంద్రీయ విద్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

# పీఎం స్వనిధి రుణాలపై ప్రత్యేక డ్రైవ్

- వీధి వ్యాపారులకు రుణ సదుపాయంపై అవగాహన
- బల్దియా అదనపు కమిషనర్ జోనా

**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పీఎం స్వనిధి పథకం ద్వారా అర్హులైన వీధి వ్యాపారులకు రుణ సదుపాయం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు బల్దియా అదనపు కమిషనర్ జోనా ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MoHUA), తెలంగాణ రాష్ట్ర మెప్మా (MEPMA) ఆధ్వర్యంలో జిడబ్ల్యూఎంసీ కార్యాలయ ఆవరణలోని మెప్మా భవనం మొదటి అంతస్తులో సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రగతి కార్యక్రమం- లోన్ కళ్యాణ్ మేళా లో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పీఎం స్వనిధి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కొత్త రుణ దరఖాస్తులను స్వీకరించి ప్రాసెసింగ్ చేస్తామన్నారు. యూపీఐ/క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపులపై అవగాహన, పీఎం స్వనిధి మొబైల్ యాప్ వినియోగంపై వ్యాపారులకు అవగాహన, రెండో విడత రుణం చెల్లించిన అర్హులైన వ్యాపారులకు క్రెడిట్ కార్డు సదుపాయం, వీధి వ్యాపారులకు ఆర్థిక భద్రత, బీమా ప్రయోజనాలపై అవగాహన, అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులకు సామాజికఆర్థిక ప్రొఫైలింగ్, వివిధ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం, డిజిటల్ లావాదేవీలు, క్రెడిట్ భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని అర్హులైన వీధి వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రుణాలు, డిజిటల్ సేవలు, క్రెడిట్ కార్డు తదితర ప్రయోజనాలను పొందాలని అదనపు కమిషనర్ జోనా కోరారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695